# మరోలా

అలా వెళ్ళటం కొత్తగా చేస్తున్న పనేంకాదు. ఈ రకమైన ఏర్పాటు మొదటిసారీ కాదు.

అయినా తత్తరపాటు. సహజంగా, చక్కగా, హాయిగా సెలఏరులా కాక... వరద తోసుకొచ్చిన ప్రవాహంలా తొందరపాటు ... ఎందుకని?

ఆలోచనతోనే నడుస్తోంది లీల. వాచీ చూసుకుంది. నిర్ణీత సమయానికి యింకాఅరగంట టైముంది. చేరాల్సిన చోటు దగ్గరే. అయినా రిక్షా ఎక్కటమే మంచిదనిపించింది. లేకపోతే మరింత సేపు నడిస్తే వొళ్ళంతా చెమట పడుతుంది.

'చెమటపడితే...' చిన్నగా నవ్వుకుంది లీల. మధురమైన అనుభవపు ఊహ.

ఏ రకమైన ఒత్తిడీ లేని ఊహలు బావుంటాయి. అలాంటి ఊహలు సాగే జీవితం రోజు రోజుకీ అరుదవుతోంది.

మూడు వారాలుగా ప్రయత్నిస్తోంటే యివాల్టికి కుదిరింది.

అరగంట... అంటే ఆరున్నరకి అక్కడికి చేరుకుంది. అక్కడ విశ్వం కలిసేక, ఇద్దరూ కలిసి అసలైన చోటు చేరేటప్పటికి ఏడవుతుంది. ఏడింటి నుంచీ తొమ్మిదింటి వరకూ, మధ్య మధ్యలో వాచీ చూసుకుంటూ, సమయాన్ని లెఖ్ఖేసుకుంటూ గడిపేది రెండు గంటలు. మళ్ళీ తొమ్మిదింటికి తిరుగు ప్రయాణం. వెళ్ళేటప్పుడు ఆతృత... తిరిగి వచ్చేటప్పుడు అలజడి. ఈ రెండింటి మధ్యా, ఆ కాస్త సమయం మాత్రం... ఎలా గడుస్తోందో సరిగ్గా మనసుకి హత్తుకోని హడావిడి... తమిద్దరి కలయిక... శరీరాలు తృప్తి పడుతున్నాయి. కానీ ఆ హాయి హృదయాల్లోకే పూర్తిగా చేరటం లేదు. అయినా, యీ మాత్రం అనుభవమైనా మహద్భాగ్యంగా వుంది.

ఇవాళ గడిచిపోతే మళ్ళీ ఎన్ని వారాలకో! తలెత్తి నడుస్తూనే వున్నా తల వొంచుకొని అడుగులు వేస్తున్నట్టే వుంది లీలకి.

ఇలా వెళ్ళే ప్రతీసారీ మనసు హాయిగా తేలిగ్గా వుంటే ఎంత బావుణ్ణనిపిస్తుంది. విశ్వం చేరువ బావుంటుంది లీలకి. అతని మాట, అతని చూపు, అతని అభిమానం, నిష్కల్మషం... తనలోకి సూటిగా ప్రయాణం చేస్తున్నట్టుంటుంది.

రెండేళ్ళ క్రితం ఉద్యోగంలో చేరింది. ఆఫీసులో విశ్వంతో అయిన పరిచయం నెలకిగానీ చనువుగా మారలేదు. ఆ చనువు దగ్గర తనంగా మారటానికి ఆరు నెలలు పట్టింది.

విశ్వం పద్ధతి మొదటి నుంచీ వేరుగానే కనిపించింది. ఆ సెక్షన్‌లో అతనే సీనియర్. లీలకి ఎదురుగానే అతని సీటు. ఆఫీసు విషయాలుకాక అతను మొదటిసారి మాట్లాడిన మాటలూ, ఆ సమయం... చాలాసార్లు మననం చేసుకుంది లీల.

ఆ రోజు...

లంచ్ టైమ్... సెక్షన్‌లో యించుమించు ఎవరూ లేనంత ప్రశాంతత. లీల సీటు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు విశ్వం.

ఏమిటన్నట్టు తలెత్తి అతని వేపు చూసింది. "ఎప్పట్నించో అనుకుంటున్నాను... ఎందుకలా, ఎప్పుడూ సీరియస్‌గా ఏదో కొంపమునిగినట్టు ఉండటం? కొంచం రిలాక్స్‌డ్‌గా ... హేపీగా వుండొచ్చుగా..." అన్నాడు. చాలా సాఫీగా, ఏ హడావుడీ లేకుండా వున్నాయి అతని మాటలు.

ఊహించని సంభాషణ అది లీలకి. పూర్తి ఆశ్చర్యమూ కాదు... కంగారూ కాదు. మొత్తానికి హడావిడిగా... కాస్తంత కరుకుగా... "ఆ విషయం మీకెందుకు?" అంది.

"ఎందుకో ఇప్పుడు కాదు, తరువాత చెపుతాను. కానీ చాలా అరుదుగా నవ్వినా... మీ నవ్వు ముఖం చాలా బావుంటుంది. ట్రై టు బి హేపీ"... అన్నాడు. అని తరిగి తన

సీటుకి వెళ్ళిపోయాడు.

ఆడవాళ్ళకి దగ్గరవటానికి మగవాళ్ళు చేసే రకరకాల ప్రయత్నాలు లీలకు తెలుసు. ఆ ఆఫీసులో విశ్వం రూపంలో ఆ బెడద ఎదురైందనుకుంది.

కానీ ఆ తర్వాత వారం రోజులు గడిచినా విశ్వం మామూలుగా, గతంలో లాగే ప్రవర్తించటం తప్ప వేరే రకం వేషాలేం వెయ్యలేదు.

అప్పుడుమాత్రం ఆశ్చర్యం కలిగింది లీలకి. ఆ ఆశ్చర్యంలోంచి తలెత్తిన కుతుహలంతోటే అతనితో పరిచయం పెరిగింది. ఆఫీసు పరిధి దాటిన పరస్పర సంభాషణలు యిద్దరి మధ్యా చనువుని పెంచాయి. మనిషి మరో మనిషితో మెలగాల్సి తీరు విషయంగా విశ్వం పద్ధతి లీలకి బాగా నచ్చింది.

ఆఫీసు, ఇల్లు... డబ్బులెఖ్ఖలవినా వుండే జీవన అభిరుచిని ఇద్దరూ కలిసి పంచుకోవటం ఆరంభించారు.ఇదంతా కేవలం కొద్ది వారాల్లోనే జరిగింది.

ఇద్దరూ కలిసి బస్‌స్టాప్ వరకూ నడిచినా, కలిసి ఏదేనా రెస్టారెంట్‌లో కూచున్నా, ఏదేనా మాట్లాడుకున్నా, చాలా ఇష్టమైన పనుల్లా మారిపోయాయి. కలిసి కాలాన్ని పంచుకునే మధురిమ లీలని నింపేసింది.

జనం చాలా తక్కువగా వుండే సినిమాలు ఎంచుకుని వెళ్ళటం, ఓ మూలగా కూచుని సినిమాని పట్టించుకోకుండా రకరకాల కబుర్లు చెప్పుకోవటంతో వారిద్దరి దగ్గరితనం ఆరంభమైంది.

ఆ మాటల్లోనే విశ్వం తన గురించి లీలకి ఏ దాపరికం లేకుండా చాలా విషయాలు చెప్పాడు.

పెళ్ళయిన రెండేళ్ళకే విశ్వం భార్య అతన్ని వదిలేసి వెళ్ళిపోయింది. అప్పటికి వాళ్ళ బాబు వయసు ఏడాది. వెళ్ళిన వెంటనే విడాకులు ప్రయత్నం మొదలెట్టింది. విశ్వమే దానికి అంగీకరించలేదు. అతని అంగీకారం లేని ఆ కేస్ ఏకపక్షం అవటం వల్ల ఇప్పటికీ తేలలేదు.

ఇద్దరూ పొంతన కుదుర్చుకుని కాపరం చెయ్యగలిగితే బాబు భవిష్యత్తుకి మంచిదని విశ్వం ఉద్దేశం.

తను కోరుకుంటున్న ఆర్థిక స్థాయి విశ్వం దగ్గర లభించకపోవటం వల్ల తన జీవితం సర్వనాశనం అయిందని ఆమె ఉద్దేశ్యం.

కొంత కాలయాపన జరిగితే ఆర్థికపరమైన ఆమె ఉద్దేశాలు మారతాయేమోనని అతని ఆశ. అలా అని ఆమెచేత నిర్బంధంగా సంసారం చేయించటం అతని ఉద్దేశం కాదు. ఆ కేస్ తేలేవరకూ అతను తన జీవితాన్ని ఎటూ నిర్ణయించుకోలేదు.

విశ్వం భార్య వెళ్ళి మూడేళ్ళు దాటింది. అయినా ఆమెలో మార్పులేదు.

ఎటూ ఏం చెయ్యలేని తన పరిస్థితినీ, ఆశల్నీ, తన ఇష్టాలని పూర్తిగా చంపుకోలేని సందిగ్ధతని లీలకి చెప్పాడు.

విశ్వం మనస్థితే కాదు, అతని కోరిక కూడా లీలకి స్పష్టంగా తెలుసు.

'నా గురించి మీకెందుకు?' అని లీల కరకుగా అన్న ఆ రోజు విశ్వం తరవాత చెపుతానన్న విషయం ఎప్పుడో చెప్పాడు.

"ఏవో వంకలు... మరేవో డొంక తిరుగుడు కారణాలు చెప్పటం నాకిష్టం లేదు. ఐ వాంట్ టు హేవ్ యు... నాకెంతగానో ఇష్టమైన ఎన్నో నీ శరీరపు కూర్పులో వున్నాయి. .... ఆ ఆకర్షణతోటే నీకు దగ్గరయ్యాను..."

ఏ మగాడూ తన ఫిజికల్ ఎట్రాక్షన్ గురించి అంత సూటిగా చెప్పటం లీల అనుభవంలో లేదు.

చాలా రకాల మగ వెకిలి చేష్టలు చూసింది.

అంతకన్నా భయంకరమైన నయవంచన చూసింది. తనకి భర్త లేదనే కాదు... అసలే తోడులేని ఒంటరి విషాదం నుంచి బైట పడాలని లీల ఉద్దేశం.

తామిద్దరి పరిస్థితే కాదు. విశ్వం పద్ధతి... అతని కోరికలోని సూటిదనం త్వరగా ఒక నిర్ణయానికి వచ్చేలా చేసాయి లీలని. ఏ రకమైన తొందరపాటు, ఆవేశం లేకుండానే అతనికి తన సమ్మతి తెలిపింది.

ఇద్దరూ కలిసి చర్చించుకునే ఈ ఏర్పాటు చేసుకున్నారు. విశ్వం మిత్రుడు మెడికల్ రిప్రజెంటెటివ్ ఒకతనున్నాడు. అతనికి ఇబ్బంది లేని సమయంలో ఆ యింటిని వాడుకుంటారు. విశ్వం ఇంట్లో అతని తల్లి, బాబు వుంటారు కాబట్టి అక్కడ ఇద్దరికీ ఇష్టంలేదు.

రేపు ఏం జరుగుతుంది? కేస్ ఏమవుతుంది? విశ్వంతో తన జీవితం శాశ్వతంగా ముడి పడుతుందా? ఇలాంటి ఆలోచనలు అనవసరం అని ముందే నిర్ణయించుకుంది లీల. తనున్న పరిస్థితికి విశ్వం కావాలి... అంతే! అందులో తప్పొప్పుల ప్రసక్తి లేదు.

విశ్వం గురించి తనకి అంతా తెలుసు. కానీ విశ్వం తన గతం గురించి తెలుసుకోవాలన్న ఆతృత కనపరచటం లేదు. కానీ ఎప్పుడేనా అతను అడిగినా, ఆ ప్రసక్తి వచ్చినా ఏ రకంగా చెప్పాలి? అన్న ఆలోచనతో విషయాన్ని తనలో తానే చాలాసార్లు పునశ్చరణ చేసుకుంది లీల.

తనలాంటి ఎందరో ఆడపిల్లల్లాగే ఉండటానికి అయినవాళ్ళ ఆశ్రయం లేని ఆడది తను.

తండ్రి లేదు... భర్త లేదు... తోడబుట్టినవాళ్ళు లేరు.

బతకటానికి ఉద్యోగం. ఫిక్సడ్ డిపాజిట్‌ల రూపంలో బేంకులో డబ్బు వుంది. ఆడది ఒంటరిగా వుంటే ఎదురవుతున్న చులకనా, అనవసర న్యూసెన్స్ తెలియటంవల్ల కజిన్ రఘునాధం ఇంట్లో వుంటోంది.

చిన్న ఉద్యోగం, పెద్ద సంసారం వున్న రఘునాధానికి ప్రతినెలా లీల ఇచ్చే రెండువేలు చాలా వీలుగా, గొప్ప ఉపశమనంగా వున్నాయి. ఆ సంగతి లీలకీ తెలుసు.

లీలకి రఘునాధం ఇంట్లో వేరే గది ఇచ్చారు. దానికి అనుకుని బాత్‌రూమ్, తదితర సౌకర్యాలు వున్నాయి. ఇబ్బందల్లా ఆ గదికి విశ్వాన్ని తీసుకెళ్లలేదు. అంతేకాదు... ఇష్టం వచ్చినట్టు ఏ సంజాయిషీ చెప్పుకోకుండా నిర్భయంగా విశ్వం దగ్గరికి వెళ్ళే వీలులేదు. ఆఫీసు సమయం దాటి ఇలా వెళ్ళాల్సినప్పుడు ఏదో ఫంక్షననో, సినిమా అనో వంక చెప్పాలి. సమయాన్ని లెఖ్ఖేసుకుంటూ ఇబ్బందిగా గడిపి అన్న టైముకి ఇల్లు చేరాలి. కొంచం ఆలిశ్యం అయితే మరిన్ని అబద్దాలు చెప్పాలి.ఎంత జాగ్రత్తగా ఉందామన్నా తరుచుగా ఆలశ్యం అవుతూనే వుంటోంది.

లీల పడే యీ ఇబ్బంది గురించి విశ్వానికి తెలుసు. అంతేకాదు ఆమె ప్రస్తుత పరిస్థితి, గతం గురించి కూడా కొంత వరకూ తెలుసు. ఈ ఇబ్బందే కాదు, లీలకి ఏ మనస్తాపం కలిగినా అతనే వోర్పుగా ధైర్యం చెపుతాడు.

సమయానికి తగిన మంచిమాట, ఎదుటి మనసు తెలిసిన చక్కటి అభివ్యక్తి మానసిక వొత్తిడిని ఎంత తేలిగ్గా దూరం చెయ్యగలవో విశ్వం రూపంలో లీలకి చాలాసార్లు తెలిసింది.

తామిద్దరి కలయిక వల్ల ఎవరికీ ఏ రకంగానూ నష్టంలేదు. అయినా ఆమోదించేవాళ్ళు అరుదు. తెరచాటుగానే గడపాల్సివస్తోంది. తామిద్దరి దగ్గరతనం తమ జీవితాల్లో సంతోషం నింపుతోంది.

ఒంటరిగా, దిగులుగా ప్రపంచాన్ని భావించే తనూ, గంభీరంగా తనలో తనే బందీలా బతికే విశ్వం చాలా వాటికి సరైన స్పందనతో కాలం గడపగలుగుతున్నారు.

ఇలా విశ్వం దగ్గరికి వెళ్ళటంలో వున్న ప్రాముఖ్యత తన వరకూ తనకి తెలుసు. అయినా ఏదో బెరుకు... సంజాయిషీల, అబద్ధాల బరువు కింద స్వేచ్ఛగా తలెత్తలేకపోతున్న ఆనందం. ఏ క్షణాన ఏ రకంగా మనసు పాడవుతుందోనన్న అనుమానం.

పది గజాల్లో వున్న రిక్షా దగ్గరికి నడుస్తున్న లీలకి అనుమానించినట్టుగానే చిరాకు ఎదురైంది.

ఇంత నవ్వు నవ్వుతూ ఆంజనేయులు సైకిల్తో ఎదురుగా అడ్డుగా వచ్చాడు. రఘునాథం పెద్దకొడుకు.

"ఏం అత్తయ్యా! చీకటి పడుతూంటే ఇప్పుడెక్కడికీ?" అన్నాడు. అని... హాయిగా అలంకరించుకున్న లీలని ఎగాదిగా చూశాడు.

"పనుంది. ఇంట్లో అమ్మకి చెప్పే వచ్చాలే" అంది లీల.

అని మరో అరక్షణం కూడా నిలబడకుండా గబగబా ముందుకి నడిచి రిక్షా ఎక్కేసింది. రిక్షా ఎక్కినా ఆంజనేయులు వెనకే వస్తున్నట్టు అనుమానంగానే వుంది.

బైల్దేరే ముందు స్నానం చేసి ఒంటికి అద్దుకున్న ఉడుకులాం చల్లదనం తెలుస్తున్నట్టే వున్నా, ఒళ్ళంతా కంపరంగా వున్నట్టనిపిస్తోంది లీలకి. ఆంజనేయులు వెర్రి నవ్వు కళ్ళ ముందు మెదిలింది.

'ఈ వెధవ చూశాడు... వో పట్టాన వదిలే రకం కాదు. ఇంటికెళ్ళి ఏదో ఒకటి వాగుతాడు... పోనీ వెనక్కి ఇంటికి వెళ్ళిపోతే..." అనుకుంది.

'ఛ... వెనక్కి వెళ్ళటమేమిటి... ఇప్పటికే విశ్వం ఎదురుచూస్తుంటాడు...' అనుకుంది మళ్ళీ.

ఆ తర్వాత మరో ఆలోచన లేకుండా విశ్వం దగ్గరకే వెళ్ళింది లీల. అనుకున్నట్టుగానే అతనితో కలిసి గడిపింది.

×××

తొమ్మిదింటికి బైల్దేరి... తొమ్మిదిన్నరకి ఇల్లు చేరదామనుకున్న లీల, పదింపావుక్కానీ ఇల్లు చేరలేకపోయింది.

రోజూ అయితే ఇల్లు చేరాక స్నానం చేసి భోంచేస్తుంది. కానీ ఇలాంటి రోజుల్లో ఇల్లు చేరిన వెంటనే భోంచేసేస్తుంది.

అన్నం తిన్న వెంటనే నిద్రపోవాలన్న అలసటతో ఇల్లు చేరిన లీలని రఘునాథం మేడ మీదకి పిలిచాడు. అన్నగారి పిలుపే అపస్వరంలా తోచింది.

"అన్నంతిని రా... నీతో మాట్లాడాలి...." అన్నాడు. వంద టన్నుల బరువు వున్నట్టుగా వుంది రఘునాథం గొంతు.

సరిగ్గా అన్నం తినలేకపోయింది లీల. విషయం అదే అయి వుంటుందనిపించినా ఆలోచన పరిపరి విధాలపోయింది. వీలున్నంత తొందరగానే అన్నగారి ముందుకు వెళ్ళింది.

"వదినకి చెప్పినట్టు నువ్వు సినిమాకి వెళ్ళలేదు కదూ..." అన్నాడు రఘునాథం.

"లేదు..." అంది. అంతకు ముందే ఆలోచన సాగుతోంది లీలకి.

"నేను నీ తోడబుట్టిన వాణ్ణికాదు. అయినా మరి చెప్పక తప్పటం లేదు. నువ్వు చేస్తున్న పని బావుండలేదు. ఇంట్లో ఎదిగిన ఆడపిల్లలున్నారు. ఇంటి పరువు అల్లరి పాలైతే ఎంత కష్టమో ఆలోచించు..." అన్నాడు.ఆ తర్వాత రఘునాధం మాట్లాడిన విషయాలవల్ల ఆంజనేయులు తన వెనకే వచ్చాడన్న సంగతి అర్ధమైపోయింది లీలకి.

లీల మరికాసేపు మాట్లాడకుండా, సహనంతో నోరు మూసుకుని, తలొంచుకుని గడిపేస్తే... అలా... ఆ ముసుగులో వ్యవహారం కొనసాగే అవకాశం వుండేదేమో...

కానీ లీలకి మౌనంగా వుండాలనిపించలేదు. ఇప్పటికే... అన్నీ తెలిసి... తనకి తప్పని సరిగా విశ్వం కావాలని తెలిసీ ఎందుకు గిల్టీగా గడుపుతోందో అర్థం కావటం లేదు. తప్పు తనదీ, విశ్వందీ కాదు. ఇలా తమని యిరుకున పెడుతున్నది ఒకే రకపు ఆలోచనది.

శారీరకమైన అవసరమనే కాదు. విశ్వంతో గడిపే జీవితమే, జీవితం అనిపిస్తోంది. అదే లేనప్పుడు... యీ ఉద్యోగం, యీ ఇల్లూ, యీ ఆశ్రయం... అన్నీ నిరుపయోగమే... నిస్సారమే...

లీలకేం సందేహం మిగలలేదు. లభించినదీ, కావాల్సిందీ స్పష్టంగా తెలుస్తున్నాయి.

నెమ్మదిగా గొంతు విప్పింది లీల.

"అన్నయ్యా.... నా పరిస్థితి నీకు తెలియంది కాదు... అలాగే ఇంటి పరిస్థితి నాకూ తెలియంది కాదు... ఇంట్లోవున్న ఆడపిల్లలకి సరైన జీవితం అందుబాట్లోకి రావటానికి ఉపయోగంగా వుంటుందనే నేను ఇవ్వగలిగినంత డబ్బు ఇచ్చి నీ దగ్గర వుంటున్నాను... కొన్ని అనవసరమైన అల్లర్లకి దూరంగా వుండొచ్చనే మీ యింట్లో ఇలా ఉండటం.

నేను చేస్తున్న పని... నడుస్తున్న తీరు... నాకు అవసరం... తప్పనిసరి అవసరం... అంతకు మించి నేను మరింతగా చెప్పటం అవసరం అనుకోటం లేదు.

వీలున్నంత వరకూ, మనిద్దరికీ బావున్నంత వరకూ వుంటాను... అంతే తప్ప పూర్తిగా నా జీవితాన్ని వో గది వరకే పరిమితం చేసి బతకలేను...

మంచీ చెడూ ఆలోచించమని అనను కానీ... ఈ పరిస్థితిలో ఏది మేలో ఆలోచించి నువ్వే చెప్పు... నువ్వు ఉండమంటేఇలాగే వుంటాను. లేదా వేరే ఇల్లు తీసుకుని వెళ్ళిపోతాను... అంతే తప్ప నా జీవితాన్ని నేను ఒదులుకోలేను. నా నడతవల్ల ఎవరికీ అన్యాయం జరగటం లేదన్న నమ్మకం నాకుంది..." అంది లీల.

రఘునాధానికింక ఆలోచించటానికి ఏమీ మిగల్లేదు.

లీల నెమ్మదిగానే చెప్పినా... తెగేసినట్టే చెప్పింది. తను చేస్తున్నది తప్పనిగానీ, మరో రకం నేరభావనగానీ లీల గొంతులో ఎక్కడా ధ్వనించలేదు. వెళ్ళమంటే ఇల్లు వదిలి వెడుతుంది. నెల నెలా తనకి ఎంతో అండగా వున్న రెదు వేలూ పోతాయి.

'ఇదే పరిస్థితిలో నీ సొంత చెల్లెలైతే'... అనేలా లీల మాట్లాడలేదు. కానీ అలా అనుకున్నా, అనుకోకపోయినా లీల ఇలా మాట్లాడుతుందని మాత్రం రఘునాధం అనుకోలేదు.

లీల ఇలాగే ఉన్నా, మరో అడుగు ముందుకేసి విశ్వం దగ్గరికి వెళ్ళిపోయినా నిజానికి తన పిల్లలకేం నష్టంలేదు.

లీల మీద, ఆమె అవసరాల మీద తనకి నిజంగా శ్రద్ధ వుందా? ఆమె బాగోగులు పట్టించుకునే అభిమానం వుందా?

నిజానిజాలు రఘునాధానికి తెలియని కావు. అప్పటివరకూ అసంకల్పిత అధికారం అతని ఆలోచనని నడిపింది. ఇప్పుడు నిజం తెలుస్తోంది. లీల జీవితానికి అత్యంత అవసరం ఏమిటో అర్థమైంది.

అందుకే తను మరోలా ఆలోచించటం మంచిది అనుకున్నాడు.

తన గది చేరిన లీలకి ఎంతో తేలిగ్గా హాయిగా వుంది. రఘునాధం నిర్ణయం ఎలా వుంటుదోనన్న ఊహ కూడా ఆమె మనసులో లేదు.

– రచన సచిత్ర మాసపత్రిక –జన్మదిన(దీపావళి)ప్రత్యేక సంచిక

డిసెంబర్ 1994